

స్టెర్లింగ్ రిజర్వ్ బీ -7 బాటిల్




ప్రభుత్వ మద్యం దుకాణం

ఓ కంపెనీ మద్యం బాటిల్ ధర రూ.800. దానిపై గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) కూడా అంతే ఉంది. మద్యం బాబుల నుంచి మాత్రం రూ.881 వసూలు చేస్తున్నారు. అంటే రూ.81 అదనంగా పిండుకుంటున్నారన్నమాట. అదెక్కడో బార్లలో అనుకుంటే పొరబాటే. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే. బాటిల్‌పై ఎమ్మార్పీ రూ.800 ఉంటే.. రూ.81 అదనంగా ఎందుకు తీసుకుంటున్నారని దుకాణంలోని సిబ్బందిని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని మద్యంబాబులు వాపోతున్నారు. ధర పెంచారనీ, ఆన్‌లైన్‌లో కొత్త ధరే వస్తోందనీ ఆ మేరకే అదనంగా తీసుకుంటున్నామని వారు చెబుతున్నారు. అన్ని మద్యం బాటిళ్లపై ఇలాగే అదనంగా వసూలు చేస్తూ.. మద్యంబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

పాత సీసా... కొత్త రేటు...!

మద్యం మాటున మోసం.. భారీగా ధరల పెంపు


- పాత సరుకు సైతం పెంచిన రేటుతో విక్రయాలు
- బాటిల్‌పై ఎమ్మార్పీ గురించి అడిగితే పొంతనలేని సమాధానాలు
- ఆన్‌లైన్‌లో కొత్త ధరే వస్తోందంటూ అంటగడుతున్న వైనం
- మందుబాబుల జేబుకు చిల్లు



ధర్మవరం, ఫిబ్రవరి 8: ఎన్నికల వేళ మద్యం ధరలను ప్రభుత్వం ఎడాపెడా పెంచేస్తోంది. ఖజానాను నింపుకునేందుకు మద్యాన్ని ప్రధాన వనరుగా మలచుకుంటోంది. 15 రోజుల క్రితం మద్యం ధరలను భారీగా పెంచేసి.. మందుబాబుల జేబులకు చిల్లు పెడుతోంది. ఈ మద్యం విక్రయాల్లో మరో మోసానికి పాల్పడుతున్నారు. ధరల పెంపు కంటే ముందుగా వచ్చిన మద్యం బాటిళ్లను సైతం పెంచిన రేటుతో మందుబాబులకు అంటగడుతున్నారు. మద్యం బాటిల్‌పై ఎమ్మార్పీకన్నా అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదేమిటని నిలదీస్తే.. ఆన్‌లైన్‌లో ధర అంతే వస్తోందంటూ చెప్పుకొస్తున్నారు.

వసూళ్ల కేంద్రాలుగా మారాయా?

ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రోజుకో రేటుతో విక్రయాలు సాగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




దీనిని బట్టి చూస్తే మద్యం దుకాణాలు అధికార వసూళ్ల కేంద్రాలుగా మారాయని మందుబాబులు మండిపడుతున్నారు. అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ప్రయత్నిస్తే దుకాణాల్లో పనిచేసే సిబ్బంది ఇక్కడ నుంచి వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం.

చెప్పిందొకటి.. చేసేదొకటి..

అధికారంలోకి వస్తే మద్యాన్ని దశల వారీగా నిషేధిస్తామని ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు ప్రస్తుత సీఎం జగన్ హామీ గుప్పించారు. సీఎం అయిన తరువాత ఆ మాట మరిచారు. మద్యాన్ని నిషేధించాల్సింది పోయి.. ఏకంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలు తెరిచింది. వీటిలో ఎమ్మార్పీకే మద్యం లభిస్తుందని ప్రచారాలు సైతం చేశారు. బెల్టుషాపులు ఉండవంటూ జగన్ ప్రకటించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అధికార పార్టీ వారి కనుసన్నల్లో మద్యం దుకాణాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలు.. బెల్టుషాపులకు సరఫరా కేంద్రాలుగామారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎక్సైజ్ అధికారుల ప్రేక్షక పాత్ర



ప్రభుత్వ మద్యం దుకాణాల తనిఖీ నామమాత్రంగా మారిందన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయాలను పర్యవేక్షించాల్సిన అధికారులు గాలికొదిలేశారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. షాపుల తనిఖీ సమయంలో ముడుపులకు లొంగిపోయి అంతా బాగుందంటూ కితాబులు ఇచ్చి వెళ్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఒక్కసారి అవకాశం ఇస్తే ఎక్కడైనా ఎమ్మార్పీకే అమ్మాల్సి ఉంటుంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సిబ్బంది మాత్రం గంటగంటకు ఓ రేటు ఆన్‌లైన్‌లో వస్తుందనీ తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం ఎక్కడా వెల్లడించట్లేదు. మద్యం విక్రయాల్లో మాత్రం ఆన్‌లైన్‌పై ఆధారపడటం ప్రభుత్వ దోపిడీకి నిదర్శనమని మందుబాబులు మండిపడుతున్నారు.

ప్రభుత్వం మద్యం ధరలు పెంచింది

ప్రభుత్వం 15 రోజుల క్రితం మద్యం ధరలు పెంచింది. దీంతో ఆన్‌లైన్‌లో చూపిస్తున్న ధరల ప్రకారమే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్నాం. పేటీఎం, ఫోన్‌పే వంటి వాటి ద్వారా మద్యాన్ని కొనుగోలు చేస్తే సర్వీస్ చార్జీలు, పన్ను అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

- వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ, పుట్టపర్తి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



నల్లమాడలో సమావేశానికి అనుమతి లేదంటూ వైసీపీ అసమ్మతి నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

సీఎం చెప్పినా.. తగ్గేదేలే..

పుట్టపర్తి వైసీపీలో తారస్థాయికి విభేదాలు

వెనక్కితగ్గని అసమ్మతి నేతలు

శ్రీధర్‌రెడ్డికి టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని హెచ్చరిక

నల్లమాడలో సమావేశం.. అణచివేతకు ఖాకీ ప్రయోగం

పుట్టపర్తి/నల్లమాడ, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి వైసీపీలో అసమ్మతి నేతలు తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అధినేత, సీఎం జగన్ చెప్పినా.. ఖాతరు చేయకుండా అసమ్మతి గళం వినిపిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి మళ్లీ టిక్కెట్ ఇస్తే.. ఓడిస్తామని తెగేసి చెబుతున్నారు. తాజాగా గురువారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సొంత మండలం నల్లమాడలో వైసీపీ అసమ్మతి నేతలు లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజారెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సమావేశమయ్యారు. అసమ్మతి నేతలు మాట్లాడుతూ.. శ్రీధర్ రెడ్డికి మళ్లీ అవకాశం ఇవ్వద్దంటూ గళం వినిపించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన కార్యకర్తలు, నేతలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. నియోజకవర్గంలో అనుచర వర్గం భూకబ్జాలు, సెటిల్మెంట్లు పెరిగిపోయాయనీ, ఎమ్మెల్యేపై అవినీతి ఆరోపణలు విపరీతంగా ఉన్నాయన్నారు. సొంత పార్టీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించి, పార్టీని నడిరోడ్డుపై నిలబెట్టారని ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తికి మళ్లీ టిక్కెట్ ఎలా ఇస్తారని అసమ్మతి నేతలు, కార్యకర్తలు ప్రశ్నించారు.

సీఎం జగన్ చెప్పినా..

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే సహకరించే ప్రసక్తిలేదని టిక్కెట్ ఆశిస్తున్న వైసీపీ నేతలు ఇదివరకే సీఎం వద్ద తెగేసి చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి వచ్చినపుడు అసమ్మతి నేతలందరూ విమానాశ్రయంలో కలిశారు. శ్రీధర్ రెడ్డికి మళ్లీ టిక్కెట్ ఇవ్వద్దనీ, ఇస్తే ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. తమ మాట పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ శ్రీధర్‌రెడ్డినే బరిలోకి దింపితే ఓడిస్తామనీ, అసమరమైతే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని అల్టిమేటం కూడా జారీ చేశారు. జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల చేర్పులు మార్పుల దిద్దుబాటు పేరుతో వైసీపీ అధిష్టానం హిందూపురం ఎంపీ, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలకు మొండి చేయి చూపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యేపై సొంత పార్టీ నేతలే కొన్నాళ్లుగా తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో శ్రీధర్‌రెడ్డికి అవకాశం ఇవ్వద్దనీ, కొత్త అభ్యర్థిని తీసుకురావాలన్న డిమాండ్ నియోజకవర్గ వ్యాప్తంగా ఊపందుకుంది. పుట్టపర్తి టిక్కెట్ ఆశిస్తున్న మాజీ సమన్వయకర్త సోమశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాముదుర్తి రవీంద్రారెడ్డి తనయుడు ఇంద్రజిత్‌రెడ్డి, లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, వైద్యుడు దేశాయి నాగేంద్రకుమార్ రెడ్డి.. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్కటయ్యారు. కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాలని అధిష్టానం వద్ద చర్చపెట్టారు. గతనెల 23న పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చిన సీఎం జగన్ వద్ద పుట్టపర్తి అసమ్మతి వైసీపీ నేతల పంచాయితీ నడిచింది. నియోజకవర్గంలో పార్టీనేతలు, క్యాడర్ సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని వ్యతిరేకిస్తోందనీ, తమ మాట పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా మళ్లీ శ్రీధర్‌రెడ్డినే బరిలోకి దింపితే ఓడిస్తామని వైసీపీ నేతలు సోమశేఖర్‌రెడ్డి, పాముదుర్తి ఇంద్రజింత్‌రెడ్డి సీఎం ఎదుటే తెగేసి చెప్పారు. అందరినీ కూర్చోబెట్టి పుట్టపర్తి పంచాయితీ తెంచాలని పక్కనే ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సీఎం సూచించి వెళ్లారు. అయినా అసమ్మతి నేతలు వెనక్కి తగ్గకపోగా.. తెర వెనుక ఉండి పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారు. అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యేకే మళ్లీ అవకాశం ఇస్తే సహకరించేదిలేదని హెచ్చరిస్తున్నారు. వరుసగా పుట్టపర్తి ఎమ్మెల్యేపై సొంత పార్టీ నేతల తిరుగుబాటుతో అధికార పార్టీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిమిత్తం అమరావతికి వెళ్లిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లినట్లు పుట్టపర్తిలో చర్చ సాగుతోంది. ఎమ్మెల్యేపై రోజురోజుకీ అసమ్మతి తీవ్రమవుతోంది. మళ్లీ టిక్కెట్ ఇవ్వొద్దని అసమ్మతి నేతలు, కార్యకర్తలు గళం విప్పుతున్న నేపథ్యంలో అణచివేసేందుకు ఖాకీని ప్రయోగిస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం నల్లమాడలో నిర్వహించిన వైసీపీ అసమ్మతి నేతలు, కార్యకర్తల సమావేశాన్ని అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకునేందుకు వెళ్లారు. వైసీపీ నేతలు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడి నుంచి పోలీసులు జారుకున్నట్లు తెలుస్తోంది. సమావేశంలో సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, నరేంద్రరెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి మళ్లీ అవకాశం ఇవ్వొద్దంటూ సమావేశానికి హాజరైన వైసీపీ నేతలు, కార్యకర్తలు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి శుద్ధ నీటిని అందిస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

సహజ వనరులను దోచేస్తున్న వైసీపీ

దౌర్జన్యాలు, దాడులకు పాల్పడిన వారిని వదిలిపెట్టను

అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు..

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

నియోజకవర్గంలో పర్యటన

హిందూపురం, ఫిబ్రవరి 8: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సహజ వనరులను దోచేశారని ప్రముఖ సినీనటుడు, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. హిందూపురం నియోజకవర్గంలో ఆయన గురువారం పర్యటించారు. చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు, శిరివరంలో ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్మించిన వాటర్‌ప్లాంట్లను ప్రారంభించారు. చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టువద్ద హిందూపురం మునిసిపాలిటీలోని 20వ వార్డు వైసీపీ కౌన్సిలర్ పరుశురాం.. ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ సహజ వనరులు కొల్లగొట్టి, రూ.కోట్లు దండుకుంటున్నారన్నారు. అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. టీడీపీ అధికారం చేపట్టగానే వారి తాట తీస్తామన్నారు. నిధుల కోసం అసెంబ్లీ ముట్టడి చేపట్టిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పట్ల ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిందని మండిపడ్డారు. గ్రామాల్లో చిన్న గుంత పూడ్చడానికి కూడా నిధులివ్వని ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నియోజకవర్గంలో సొంత డబ్బు, టీడీపీకి చెందిన ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. వైసీపీ నాయకులకు అది మింగుడు పడక అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం హిందూపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో 300మందికిపైగా మైనార్టీలు.. వివిధ పార్టీల నుంచి టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి, బాలయ్య సాదరంగా ఆహ్వానించారు.


నాటకీయ పరిణామాల మధ్య చేరిక

అధికార పార్టీకి చెందిన హిందూపురం మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ పరశురాం గురువారం ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నట్లు వైసీపీ నాయకులకు సమాచారం అందింది. వెంటనే హిందూపురం టూటౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. కౌన్సిలర్ ఇంటి వద్దకెళ్లారు. ఎందుకు వచ్చారని కౌన్సిలర్ ప్రశ్నించగా.. 'కర్ణాటక సరిహద్దులో గతంలో మీరు గొడవపడ్డారనీ, ఆ కేసుకు సంబంధించి స్టేషన్‌కు రావాలం'టూ పోలీసులు తెలిపారు. తాను వచ్చేదిలేదని కౌన్సిలర్ భీష్మించారు. దీంతో ఆయనను పోలీసులు స్టేషన్‌కు తరలించేందుకు సిద్ధం అవుతుండగా.. టీడీపీ నాయకులు కొంతమంది అక్కడకు చేరుకుని, అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్‌ను ద్విచక్రవాహనంలో ఎక్కించి చిలమత్తూరులో ఉన్న బాలకృష్ణ వద్దకు తీసుకెళ్లారు. ఆయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఇక.. వ్యవసాయానికి 7 గంటలే..

అంతకన్నా ఎక్కువ విద్యుత్ సరఫరా చేస్తే షిఫ్ట్ ఆపరేటర్‌పై చర్యలు

ఈఈ ఆదేశాలు



ఈఈ షిఫ్టు ఆపరేటర్లకు పంపిన ఆదేశాలు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 8: వ్యవసాయానికి ఇక 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా ఇవ్వాలని హిందూపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతి.. షిఫ్ట్ ఆపరేటర్లకు ఆదేశాలిచ్చారు. ఆపై సరఫరా ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ మేరకు ఆపరేటర్లు సిద్ధమయ్యారు. దీంతో పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారనుంది. దీనిపై అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

రెండు రోజులు మాత్రమే కోతలు

వ్యవసాయానికి 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆదేశాలివ్వడం వాస్తవమే. యూనిట్‌లో సమస్య ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేస్తున్నాం. రెండు రోజులు మాత్రమే రెండు గంటల సేపు కోతలు ఉంటాయి. తరువాత మరమ్మతులు పూర్తి కాగానే విద్యుత్ యథాతథంగా సరఫరా చేస్తాం.

- భూపతి, ఈఈ, విద్యుత్ శాఖ

నిబంధనల మేరకే ఓటరు దరఖాస్తులు

పరిష్కరించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 8: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు తుది జాబితా తరువాత 30వేల దరఖాస్తులు వచ్చాయనీ, వీటిని నిష్పాక్షికంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మార్పులుచేర్పులు, తొలగింపులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిశీలిస్తున్నట్లు వివరించారు. సమస్య ఉంటే జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. 18ఏళ్లు నిండిన యువతీయువకులందరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విజయవాడలో పురం ఆశాల అరెస్టు

హిందూపురం, ఫిబ్రవరి 8: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విజయవాడకు వెళ్లిన హిందూపురం ప్రాంతానికి చెందిన ఆశా కార్యకర్తలను బుధవారం సాయంత్రం విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు జిల్లా భైరవకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారిని గురువారం సాయంత్రం వదిలిపెట్టినట్లు తెలిసింది. అంతేకాక 158కి.మీ. దూరం బస్సును ఆపకుండా తీసుకెళ్లారనీ, తాగునీరు కావాలని అడిగినా పోలీసులు ఇవ్వలేదని లేపాక్షి మండలానికి చెందిన గంగాదేవి రామాంజినమ్మ, పద్మ, లలిత, పార్వతమ్మ వాపోయారు.



హిందూపురానికి చెందిన ఆశా కార్యకర్తలను బస్సులో తరలిస్తున్న దృశ్యం

భారీగా ఎస్ఐల బదిలీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 8: ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాలో పెద్దఎత్తున ఎస్ఐలకు స్థానచలనం కల్పించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న 21 మందికి స్టేషన్లను కేటాయించారు. పరిగి స్టేషన్‌లో పనిచేస్తున్న నరేంద్రను ధర్మవరం రూరల్‌కు, సీసీఎస్ నుంచి జనార్దన్ నాయుడును అమరాపురం స్టేషన్‌కు బదిలీ చేశారు.

గంజాయి సాగు కేసులో నాలుగేళ్ల జైలు

రూ.10వేల జరిమానా కూడా విధిస్తూ కోర్టు తీర్పు

హిందూపురం, ఫిబ్రవరి 8: గంజాయి సాగు కేసులో నిందితుడికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ అనంతపురం 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి అనిత గురువారం తీర్పు వెలువరించారు. ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ తెలిపిన వివరాల మేరకు.. 2019లో పరిగి మండలం ఎర్రగుంట పంచాయతీ నేతులపల్లికి చెందిన నారాయణప్ప తన పొలంలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందింది. అప్పట్లో ఎక్సైజ్ అధికారులు పొలంలో పరిశీలించగా.. అంతర్‌పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. దీనిపై 2019 సెప్టెంబరు 14న మడకశిర ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పట్లో పరిగి తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పంటను పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో నేరం రుజువు కావడంతో గురువారం నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించినట్లు ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ తెలిపారు.

ఎటు చూసినా తప్పులే..!

ఓటరు జాబితాలో డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు

ఏళ్ల కిందట ఇతర ప్రాంతాలకు వెళ్లినా తొలగించని అధికారులు

బీఎల్ఏల ఫిర్యాదులు బుట్టదాఖలు



కురుగుంట ఓటరు జాబితాలో తోపుదుర్తి గ్రామస్థులు



కురుగుంట జాబితాలో ఒకే వ్యక్తి పేరుతో మూడుఓట్లు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: తుదిఓటరు జాబితాలో ఎటుచూసినా తప్పులే కనిపిస్తున్నాయి. ఏ జాబితాను పరిశీలించినా డబుల్, ట్రిబుల్ ఓట్లు తారసపడుతున్నాయి. వీటికితోడు ఏళ్ల కిందట ఇతర ప్రాంతాలకు వెళ్లినా జాబితాలో ఓటు ఉన్నట్లు నమోదు చేశారు. వీటికి సంబంధించి అన్ని ఆధారాలతో బీఎల్ఏలు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించలేదు. దీన్నిబట్టిచూస్తే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి బీఎల్ఓలు పనిచేశారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

● ఎన్ స్నేహచౌదరి (ఎన్‌డీఎఫ్ 1709765), నాప నరసింహులు(ఎన్‌డీఎఫ్ 17 09781) వీరు మండలంలోని పాపంపేటలో నివాసముంటున్నారు. వీరి ఓట్లను ఓటర్ జాబితాలో నుంచి తొలగించారు. ఎస్.నాగమ్మ(డీజీఎన్0342964) గుంతకల్లుకు వెళ్లిపోయారు. ఎ.సుంకన్న (డీజీఎన్0340 158) రాయదుర్గంలో ఉంటున్నాడు. ఎస్.బాజక్క (డీజీఎన్0342386) గుత్తిలో ఉన్నారు. వీరంతా పదేళ్ల కింద ట గ్రామం విడిచిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ మేరకు బీఎల్ఏలు బీఎల్ఓలకు ఫిర్యాదు చేశారు. అయితే వీరి ఓట్లను జాబితాలో అలానే ఉంచారు. ఇలాంటి ఓట్లు స్థానిక జాబితాలో పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం.

● కురుగుంటలో నల్లబోతుల ఈశ్వరయ్య (ఎన్‌డీఎఫ్12 74968), (ఎన్‌డీఎఫ్1581578), (ఎన్‌డీఎఫ్0533760)పేరిట 58, 59, 60 పో లింగ్ కేంద్రాల్లో ఓట్లు నమోదయ్యాయి. ఏ కీర్తన (ఎన్‌డీఎఫ్1757517), రాజగోపాలనగ్రావుల (ఎన్‌డీఎఫ్0881038), శ్రీనివాసచౌదరి (ఎన్‌డీఎఫ్083 6868)వీరు కురుగుంటలోనే ఉన్నారు. అయితే జాబితాలో వీరికి ఓటు నమో దు చేయలేదు. ఓబులమ్మ (ఎన్‌డీఎఫ్1140656), వేణుగోపాల్‌రావు (ఎన్‌డీఎఫ్1142322), జామునబీ పేతేన (ఎన్‌డీఎఫ్0827008)) వీరు మరణించారు. అయినా జాబితాలోనే ఉంచారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తిగ్రామానికి చెందిన వారికి సంబంధించిన ఓట్లు పదుల సంఖ్యలో గ్రామంలో ఉన్నాయి. అయినా తొలగించలేదు.

రాప్తాడులో...




చిట్రెడ్డి మౌనిక పేరుతో బుక్కచెర్ల, బొమ్మేపర్తిలో ఉన్న ఓట్లు

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో మరణించిన వారి పేర్లు సైతం తుది ఓటరు జాబితాలో ఉన్నాయి. మరణించి ఏళ్లు గడుస్తున్నా వారి పేర్లు తొలగించలేదు. రాప్తాడు గ్రామానికి చెందిన గవ్వల పప్పూరమ్మ మూడేళ్ల క్రితం చనిపోయింది. ఇటీవల విడదల చేసిన ఓటరు జాబితాలో 139 కేంద్రంలో ఎన్‌డీఎఫ్ 1149815తో ఓటు ఉంది. రాప్తాడు గ్రామానికి చెందిన కుంటిమద్ది ముత్యాలప్ప రెండేళ్ల కిందట చనిపోయాడు. ఓటరు తుది జాబితాలో 141 కేంద్రంలో డీజీఎన్ 2819241తో ఓటు ఉంది. బొమ్మేపర్తి గ్రామంలో 10 మంది మరణించినా వారి ఓట్లు తొలగించలేదు. బొమ్మేపర్తికి చెందిన చాకలి రామాంజనేయులు ఏడాది కిందట మరణించా డు. ఓటరు జాబితాలో డీజీఎన్ 4625117తో ఓటు అలాగే ఉంది. బొమ్మేపర్తికి చెందిన అప్పిరెడ్డి గారి చంద్రమ్మ దాదాపు ఏడాది కిందట చనిపోయింది. తుది ఓటరు జాబితాలో డీజీఎన్ 2883890 తో ఓటు ఉంది. బొమ్మేపర్తికి చెందిన మల్లికార్జునరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, చిట్రెడ్డి తిమ్మక్క రెండు నెలల కొందట మరణించారు. ఓటరు జాబితాలో డీజీఎన్ 4625562, డీజీఎన్ 4625612, డిజిఎన్ 2886216 తో ఓట్లు ఉన్నాయి.


కొందరికి రెండు ఓట్లు

మండలంలోని బొమ్మేపర్తి, భోగినేపల్లి ఇతర గ్రామాల్లో కొంత మందికి రెండు ఓట్లు ఉన్నాయి. బొమ్మేపర్తికి చెందిన చిట్రెడ్డి మౌనికకు రెండేళ్ల కిందట బుక్కచెర్లకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ప్రస్తుతం ఆమె పేరు మీద బొమ్మేపర్తి, బుక్కచెర్లలో రెండు ఓట్లు ఉన్నాయి. భోగినేపల్లిలో తుమ్మల రుక్మిణమ్మ పేరుతో సీరియల్ నెంబర్ 31, 317లో రెండు ఓట్లు ఉన్నాయి. ఇలా మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో మరణించిన, వివాహాలు అయి ఇతర గ్రామాలకు వెళ్లిన వారి ఓట్లు, డబుల్ ఓట్లు అలాగే ఉన్నాయి. ఓటరు తుది జాబితాలో తప్పుల తడకగా ఉంది.

అవే తప్పులు రిపీట్..



అశోక్‌రెడ్డి కొండారెడ్డి పేరుమీద ఉన్న డబుల్ ఓట్లు



వెంకటతిమ్మాపురంలో సురేష్‌కు ఓటున్నా డిలీట్ చేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: మండలంలోని తుంపర్తి గ్రామంలోని ఓటరు జాబితాలో అవే తప్పులు రిపీటయ్యాయి. బూత్‌నెంబర్ 274లో సీరియల్ నెంబర్ 11, 12లో అశోక్‌రెడ్డి కొండారెడ్డి పేరుమీద రెండు ఓట్లు నమోదయ్యాయి. అదేబూత్‌లో సీరియల్‌నెంబర్ 63లో యర్రగుంట నీరజ గ్రామంలో ఉన్నా ఓటును తొలగించారు. వెంకతిమ్మాపురం గ్రామంలో బూత్ నెంబర్ 271లో సీరియల్ నెంబర్ 118లో టీ సురేష్ గ్రామంలో ఉన్నా జాబితాలో ఓటును తొలగించారు. బీఎల్ఓల నిర్లక్ష్యంతోనే తప్పులు దొర్లాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆర్టీఓ ఆఫీస్‌లో సర్వర్ సమస్య..!

- నాలుగు రోజులుగా స్తంభించిన ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షలు
- పరిపాలన విభాగంలో పనులకు బ్రేక్
- వాహనదారుల నిట్టూర్పు



ఖాళీగా దర్శనమిస్తున్న ఎల్ఎల్ఆర్ పరీక్షా కేంద్రం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8: జిల్లాలోని ఆర్టీఓ కార్యాలయాల్లో సర్వర్ సమస్య తలెత్తింది. నాలుగు రోజులుగా సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షల కోసం ప్రతిరోజు పదుల సంఖ్యలో వాహనదారులు అనంతపురం ఆర్టీఓతోపాటు తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లోని కార్యాలయాలకు వస్తున్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షలు బంద్ అయ్యాయి. దీంతో అనుకూలమైన తేదీలకు ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్ష స్లాట్‌లను మార్చుకోవాలని ఆర్టీఓ అధికారులు ఉచిత సలహా ఇచ్చి వాహనదారులను వెనక్కి పంపుతున్నారు. సర్వర్ మొరాయింపుతో పరిపాలన విభాగంలోనూ పలు రకాల ఫైల్స్ పెండింగ్‌లో పడ్డాయి. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ రెన్యూవల్స్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓనర్‌షిప్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పర్మిట్స్, ఆధార్ సీడింగ్, ఇంటర్‌నేషనల్ లైసెన్స్ పనులు పూర్తిగా బంద్ అయ్యాయి. తమ పనుల కోసం ప్రతి రోజు ఆర్టీఓ కార్యాలయాలకు వాహనదారులు వెళ్లినా సర్వర్ ఇంకా పనిచేయలేదని అధికారులు చెబుతుండటంతో చేసేది లేక వెనుతిరుగుతున్నారు. ఇదిలా ఉండగా... సర్వర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సర్వర్ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు అనంత ఆర్టీఓ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

బైక్‌లు చోరీచేసే దొంగల అరెస్టు

29 ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8: ద్విచక్రవాహనాలు చోరీ చేసే నలుగురు దొంగలు పట్టుబడ్డారు. అనంతపురం సీసీఎస్, టూటౌన్, కళ్యాణదుర్గం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితోపాటు ఇద్దరు మైనర్లను పోలీసులు జేజే బోర్డు ఎదుట హాజరు పరిచారు. వారి నుంచి రూ.25లక్షల విలువైన 29 ద్విచక్రవాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అన్బురాజన్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు. అరెస్టయినవారిలో అనంతపురం నాలుగోరోడ్డుకు చెందిన నరేష్, పంగల్‌రోడ్డు సమీపంలో ఉంటున్న మహేంద్ర, అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన నాని కుమార్‌లు, మరో ఇద్దరు మైనర్లు మంచి స్నేహితులు. జల్సాలకు బానిసలైన వీరు వాహనాల చోరీలకు పాల్పడుతూ వచ్చారు. ఈ ఐదుగురు పట్టణ ప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు, జిల్లా సర్వజన ఆసుపత్రి తదితర రద్దీ ప్రాంతాలకు వెళ్లడం, అక్కడ పార్క్ చేసిన వాహనాలను టార్కెట్ చేసేవారు. నకిలీ తాళాలతో బైక్‌లను ఎత్తుకెళ్లేవారు. అలాంటి వాహనాలను నరేష్ తక్కువ ధరకే విక్రయించి వచ్చిన సొమ్మును జల్సాలకు వినియోగించేవారు ఏడాదిన్నర కాలంలో అనంతపురం టూటౌన్, త్రీటౌన్, తాడిపత్రి, ధర్మవరం, బత్తలపల్లి, కర్నాటక రాష్ట్రం బళ్లారి, సింధనూరు ప్రాంతాల్లో బైక్‌లు దొంగలించారు. నాలుగు రోజుల క్రితం నల్లచెరువు మండల కేంద్రంలో ట్రాక్టర్‌ను దొంగలించి కళ్యాణదుర్గంలో తక్కువ ధరకే విక్రయించారు. బైక్‌లను దొంగతనాల కోసం అద్దెకారును ఉపయోగించేవారు. ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం, సీసీఎస్ టూటౌన్ సీఐలు ఇస్మాయిల్, వెంకటేష్‌నాయక్, జనార్దన్, క్రాంతికుమార్, ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుళ్లు బయన్న, శ్రీనివాస్, తిరుమలేష్, కానిస్టేబుళ్లు రంజిత్, శ్రీధర్‌ఫణి, వన్నూరుదాస్, ఆసిఫ్‌లు ప్రత్యేక బృందంగా ఏర్పడి వారిని పంగల్‌రోడ్డు సమీపంలో పట్టుకున్నారు. వారి నుంచి 24బైక్‌లు, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు.

అప్పులు తీర్చేందుకు చోరీ..

అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటలోని చంద్రబాబునగర్‌కు చెందిన పోతులజాన్ ఇంటి ఖర్చులు, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వారి నుంచి ఒత్తిడి రావడంతో వాటిని తీర్చడానికి దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆసుపత్రికి జనం విరివిగా వస్తారని ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. నకిలీ తాళాలతో రెండు నెలల కాలంలో ఐదు ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో అర్బన్ సీఐ హరినాథ్, ఏఎస్ఐ ఖాదర్‌బాషా, కానిస్టేబుళ్లు గంగాధర్, సురేంద్ర, హనుమంతరాయుడు, మహేష్‌లు బృందంగా ఏర్పడి అనంతపురం బైపాస్‌లో నిందితుడిని అరెస్ట్ చేసి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

రానున్న ఎన్నికల్లో జిల్లా అభివృద్ధే అజెండా కావాలి

'అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకావిష్కరణ చేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: రానున్న ఎన్నికల్లో జిల్లా అభివృద్ధి ప్రధాన అజెండా కావాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం పెన్షనర్ భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో 'అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, నీటిరంగ నిపుణులు ఎస్ఎం బాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఖనిజ వనరులు విస్తారంగా ఉన్నా వాటి ఆధారంగా పరిశ్రమలు నిర్మించలేదన్నారు. పనుల కోసం గ్రామీణ పేదలు, చదువుల కోసం పిల్లలు, ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నా పాలకులు పశ్చాత్తాపం పడటం లేదన్నారు. డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలు కీలకమైనవన్నారు. ఈ రంగాలన్నింటిల్లో జిల్లా అత్యంత వెనుకబడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధికి దూరమైన వారి బాధలను రానున్న ఎన్నికల అజెండాగా చేయడానికి సీపీఎం పార్టీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజిక హక్కుల నాయకుడు సత్యబోస్, మాజీ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, లలిత కళాపరిషత్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ ప్రసూన, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, రిటైర్డ్ తహసీల్దార్ జయరామప్ప, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు టీజీఎన్‌బీ రావు, రచయిత నానీల నాగేంద్ర, రాహుల్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వినాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటనారాయణ, ముష్కిన్ పాల్గొన్నారు.

8 మందికి ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా బాధ్యతలు

రాజకీయ పలుకుబడి ఉన్న వారికి అందలం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8: ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న 8 మండలాలకు ఇన్‌చార్జి ఎంపీడీఓలను నియమించారు. ఆయా మండలాలు, పక్క మండలాల్లోని ఈఓఆర్డీలు, ఏఓలకు ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా బాధ్యతలు అప్పగిస్తూ గురువారం జడ్పీ సీఈఓ వైభోమ్ నిధి యాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. బొమ్మనహాల్ ఎంపీడీఓగా ఈఓఆర్డీ విజయమ్మ, కణేకల్లు ఎంపీడీఓగా ఈఓఆర్డీ గూడెన్న, గార్లదిన్నె ఎంపీడీఓగా ఈఓఆర్డీ వెంకటలక్ష్మమ్మ, అమడగూరు ఎంపీడీఓగా పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ ఈఓఆర్డీ అశోక్ కుమార్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కొత్తచెరువు ఎంపీడీఓగా ఈఓఆర్డీ సిద్దారెడ్డిని, చిలమత్తూరు ఎంపీడీఓగా ఏఓ రామ్‌కుమార్‌ను, రొద్దం ఎంపీడీఓగా ఈఓఆర్డీ కేశవరెడ్డిని, రొళ్ల ఎంపీడీఓగా ఆర్‌వీవీజీ ప్రసాద్‌ను నియమించారు. అయితే కొన్ని మండలాల్లో ఈఓఆర్డీ, ఏఓలు ఉన్నా వారిని కాదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పారని పక్క మండలాల్లో పనిచేసే కొందరు అధికారులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా నియమించినట్లు విమర్శలు వస్తున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8: ప్రధానోపాధ్యాయుల అకౌంట్ టెస్ట్-2024కు దరఖాసులుఉ కోరుతున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్ టెస్ట్ పేపర్-1, పేపర్-2కు సంబంధించి పరీక్ష ఫీజులు రూ. 150, ఒక పేపరుకు అయితే రూ. 100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 17వ తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు. రూ. 60 ఫైన్‌తో ఈ నెల 22వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. పరీక్ష ఫీజును గేట్‌వే ద్వారానే చెల్లించాలని, అదేవిధంగా అప్‌లోడ్ చేసిన దరఖాస్తును ఈనెల 23వ తేదీలోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని ఆ ప్రకటనలో సూచించారు.

15న జాబ్‌మేళా

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: నిరుద్యోగ యువత కోసం ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా కొంగరెడ్డిపల్లిలోని విజ్ఞానసుధ డిగ్రీ, పీజీ కాలేజీలో జాబ్‌మేళా ఉంటుందని, దాదాపు 100పైగా కంపెనీలు ఇందులో పాల్గొంటున్నాయన్నారు. పది, ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అర్హతను బట్టి వేతనం ఉంటుందన్నారు. చెన్నై, బెంగుళూరుతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 83744 21195, 81425 09017, 63009 54441 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డాక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే డాక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ హరిబాబు గురువారొ ఒక ప్రకటనలో కోరారు. డివిజన్‌లోని తపాలా కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను ఆ రోజున ఉదయం 11 గంటలకు తన కార్యాలయంలో స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదుదారులు ఈనెల 19లోపు పోస్టు ద్వారా కూడా తెలియజేయవచ్చన్నారు. పోస్టు కవరుపై డాక్ అదాలత్ అని తప్పకుండా రాయాలన్నారు. ఫిర్యాదును పరిశీలించిన అనంతరం పరిష్కార లెటర్‌ను ఈ-మెయిల్ ద్వారా పంపుతామన్నారు.

ఆర్థిక క్రమశిక్షణలేని బడ్జెట్

మాజీ మంత్రి పరిటాల సునీత



అనంతపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణ లేని బడ్జెట్‌గా ఉందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం ఎంత.?. దేని ద్వారా వస్తోంది..? ఖర్చులు ఎంత అన్నది కనీస స్పష్టత లేనివిధంగా బడ్జెట్ ఉందని అన్నారు. గురువారం అనంతపురంలోని తన నివాసంలో పరిటాల సునీత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేలా బడ్జెట్ ఉందనేది మరోసారి ప్రభుత్వం రుజువు చేసుకుందన్నారు. ప్రభుత్వం చేసిన రూ. 9 లక్షల కోట్ల అప్పు ఎవరి జేబుల్లోకి వెళ్లిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో చూపిన కేటాయింపులకు తగ్గట్టు ఖర్చులు లేకనే రైతులు పంటల సాగుకు దూరమవుతున్నారన్నారు. డిస్కమ్ బకాయిలు రూ. 27,284 కోట్లుగా చెబుతున్న ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ చార్జీల వడ్డనలో ఎక్కడా రాజీపడకుండా వ్యవహరిస్తోందన్నారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. నాసిరకం మద్యంతో 30 వేల మందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైద్యం కోసం ఎంతో చేస్తున్నామని చెప్పుకునే జగన్ సర్కారు బడ్జెట్‌లో మాత్రం ఆరోగ్యశ్రీకి అంతంత మాత్రంగానే నిధులు ఇచ్చారన్నారు. 35 లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారన్నారు. రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్య పెంచాల్సిందిపోయి తగ్గించారన్నారు. సున్నావడ్డీ, పంట రుణాలను 5 లక్షల నుంచి 3 లక్షలకు కుదించడం ఏంటని ప్రశ్నించారు. చేనేతలు తీవ్ర కష్టాల్లో ఉంటే ఈ బడ్జెట్‌లో వారికి కనీసం సంతృప్తి చెందే ప్రకటన చేయలేదన్నారు. సామాన్యుడికి ఏ మాత్రం స్వాంతన లేనివిధంగా వ్యవహరిస్తున్న జగన్ సర్కారుకు ఇదే తుది బడ్జెట్ అవుతుందని పరిటాల సునీత స్పష్టం చేశారు.

అంకెల్లో సంక్షేమం.. ఊహల్లో అభివృద్ధి

ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్



అనంతపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంకెల్లో సంక్షేమం.. ఊహల్లో అభివృద్ధి అన్న చందంగా ఏపీ బడ్జెట్ తయారైందని టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం ఆయన అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌గా ఉందన్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో కరువు ఓ వైపు పరిశ్రమలు రాక మరోవైపు వలసలు కొనసాగుతుంటే అంతా అద్భుతంగా ఉన్నట్లు బుగ్గన చెప్పుకుంటుండటం దారుణమన్నారు. అభివృద్ధి గురించి చెబుతున్న జగన్ సర్కారు రాష్ట్రంలో కనీసం రోడ్లు వేయలేని దుస్థితిలో ఉందన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అసలు జిల్లాకు ఎంత కేటాయించారన్నది స్పష్టత లేదన్నారు. హంద్రీనీవాతోపాటు హెచ్ఎల్సీ కాలువల గురించి ప్రస్తావనే లేదన్నారు. మరోవైపు రైతులకు స్వాంతన కలిగించేలా ఈ బడ్జెట్‌లో ఒక్క అంశం లేదన్నారు. డిస్కమ్ బకాయిలు రూ. 27,284 కోట్లుగా చెప్పిన సర్కార్ సామాన్యులపై విద్యుత్ చార్జీల రూపంలో ఇప్పటికే వేల కోట్ల రూపాయలు భారం మోపిందని మండిపడ్డారు. మద్యపాన నిషేదం అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ఇప్పుడు అదే మద్యం ద్వారా వచ్చే ఆదాయంతోనే సర్కార్‌ని నడుపుతున్నారని విమర్శించారు. నాసిరకం మద్యంతో వేలాది మంది పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలను పొట్టన పెట్టుకున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాలను మభ్యపెడుతూ మరోసారి మోసానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌నే కాదు ప్రజలు సర్కారును నమ్మడం లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

అంతా పన్నుల బాదుడే: ఆలం



నార్పల: పన్నుల బాదుడే తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ లోటును రూ. 13 వేల కోట్ల నుంచి రూ. 44వేల కోట్లకు, ద్రవ్యలోటును రూ. 35 వేల కోట్ల నుంచి రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత ఈ వైసీపీ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. అప్పులు రెట్టింపు అయ్యాయని, వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతి స్కీం.. ఓ స్కామ్ లాగా మారిందని అన్నారు. పలు సంక్షే పథకాలను రద్దు చేసి.. అన్ని వర్గాల ప్రజలనూ తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. కరెంట్, రిజిస్ట్రేషన్ తదితర చార్జీలను విపరీతంగా పెంచి.. ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని వేసిందని ధ్వజమెత్తారు.

చెక్కమగ్గం తయారుచేసే దుకాణం దగ్ధం

రూ.12 లక్షల ఆస్తి నష్టం



దుకాణంలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

ధర్మవరం, ఫిబ్రవరి 8: పట్టణంలోని కదిరిగేటు వద్ద చెక్కమగ్గం తయారు చేసే దుకాణం బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిబూడిదైంది. 35 ఏళ్లగా చెక్కమగ్గాలు, మగ్గానికి సంబంధించి సామగ్రిని తయారు చేస్తూ జీవనంసాగిస్తున్నానని, గుర్తు తెలియని వ్యక్తులు దుకాణానికి నిప్పు పెట్టారని బాధితుడు సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశాడు. దుకాణం నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు తనకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. దుకాణంలో ఉన్న 350 దోన్లు, మిషన్లు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయని, రూ.12లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ బాధితుడిని ఫోన్‌లో పరామర్శించారు. జరిగిన సంఘటనపై ఆరాతీసి భరోసా ఇచ్చారు. అదేవిధంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, గోసల శ్రీరాములు బాధితుడిని పరామర్శించారు. బీజేపీ నాయకులు డిష్‌రాజు, బోడగలగిరిధర్, తుంపర్తిపరమేష్, దుస్సాక్రిష్ణ, నబీరసూల్, నారాయణస్వామియాదవ్, పొరాళ్లరహీం దుకాణాన్ని పరిశీలించి జరిగిన నష్టంపై ఆరాతీశారు.

మళ్లీ ఉద్యమబాట తప్పదు

రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీఎన్జీఓ అసోసియేషన్ నాయకుల అల్టిమేటం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: తమ డిమాండ్లను పరిష్కరించాల్సిందేనని లేదంటే ఉద్యమబాట తప్పదని ఏపీఎన్జీఓ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. గురువారం ఎన్జీఓ హోంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ ప్రకటించి 6 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఐఆర్ ప్రకటించలేదని, వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలతోపాటు డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీన జేఏసీ సమావేశంలో ఉద్యమకార్యాచరణ ప్రకటించి 12న చీఫ్ సెక్రటరీకి నోటీసులు అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జమీలాబేగం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీలు శోభారాణి, మహేష్, నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయండి

● సీఐని ఆదేశించిన జాయింట్ కలెక్టర్

కొత్తచెరువు, ఫిబ్రవరి 8: మండలంలోని లోచర్ల గ్రామ సచివాలయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుంచపు దుర్గేశ్‌పై దాడిచేసిన సర్పంచ్ తనయుడు నారాయణస్వామిపై కేసు నమోదు చేయాలని సీఐ రాజారమేశ్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. గురువారం లోచర్ల గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. దాడికి సంబంధించిన కారణాలను సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడిచేయడం మంచి పద్ధతికాదన్నారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ భాగ్యరేఖకు ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళావతి, డిప్యూటీ తహసీల్దార్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం


ధర్మవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు


తాడిమర్రి మండలం ఆత్మకూరులో..


బత్తలపల్లి మండలం గరిశల పల్లిలో..

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 8: చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 37వ వార్డులో గురువారం వారు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లిషరీఫ్, మాధవరెడ్డి, శీలామూర్తి, కొత్తపేట ఆది, గోసల శ్రీరాములు, బడిగింజల రమణ, కరెంటు ఆది, కత్తుల బాబ్జీ, జనసేన పార్టీ మత్స్యకార విభాగపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు, తెలుగుమహిళలు పాల్గొన్నారు.

తాడిమర్రి/ బత్తలపల్లి: మండలంలోని ఆత్మకూరు గ్రామంలో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు రఘురాంచౌదరి, ఆదినారాయణ, సాయి, శేఖర్, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, వెంగముని, విశ్వనాథ్, బీసీ సంఘం నాయకులు యల్లప్ప, గణేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే బత్తలపల్లి మండలం గరిశలపల్లి గ్రామంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, నాయకులు నారాయణరెడ్డి, జక్కంపూటి నాగభూషణ, గంటాపురం జగ్గు,తాళ్ళూరి సతీష్, ఉమపతినాయుడు,గరిశలపల్లిరవి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

తనకల్లు, ఫిబ్రవరి 8: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మడకశిర ఏడీఏ క్రిష్ణమీనన్ గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అమర్‌నాథ్ ట్రేడర్‌లో రూ.36,350లు విలువగల పురుగులమందులకు సంబంధించిన ఇన్‌వాయిస్ లేనందున వాటి అమ్మకాలను నిలిపివేసినట్లు చెప్పారు. ఎస్ఎంటీ ఆగ్రో ట్రేడర్స్‌లో రూ.85,800లకు సంబంధించి ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేసినట్లు తెలిపారు. 21రోజుల్లో వీటికి సంబంధించిన ఇన్‌వాయిస్‌లను తేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కదిరి వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

కదిరి, ఫిబ్రవరి 8: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అనురాధ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రిలో సేవలన్నీ సంతృప్తిగా ఉన్నాయన్నారు. ఆమె వెంట డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, టీబీ కంట్రోల్ అధికారి తిప్పయ్య, ఆసుపత్రి అధికారులు విజయలక్ష్మీ, హుస్సేన్, సూపరిండెంట్ వలసాదేవి ఉన్నారు.

నేడు టీడీపీ సర్వసభ్య సమావేశం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 8: మండలకేంద్రంలోని వెంకటసాయి ఐటీఐలో శుక్రవారం ఉదయం 11గంటలకు టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జీలు, అభిమానులు తప్పక హాజరు కావాలని కోరారు.

వైసీపీ ప్రభుత్వాన్ని పారదోలుదాం: టీడీపీ

కదిరి, ఫిబ్రవరి 8: ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండకట్టాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. అమడగూరు మండల కేంద్రంలోని చౌడేశ్వరీ ఆలయ ఆవరణలో గురువారం టీడీపీ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పలువురు నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి లేకుండా చేసిందన్నారు. రైతులకు కూడా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని పారద్రోలాలని పిలుపునిచ్చారు. సీఎంగా చంద్రబాబును, పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె రఘునాథ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, నాయకులు శ్యామ్‌బాబునాయుడు, బూత్‌కన్వీనర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ సదస్సు

నల్లచెరువు, ఫిబ్రవరి 8: మండలకేంద్రంలోని గీతా మందిరంలో శుక్రవారం జరిగే జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలని మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్ కోరారు. గురువారం వారు మాట్లడుతూ బీసీ సదస్సు నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు నిర్వహించనున్నామన్నారు. కందికుంట, బీకే పార్థసారధి, నిమ్మలకిష్టప్ప, సవితమ్మ తదితర ముఖ్యనేతలు హాజరవుతారన్నారు. మండలంలోని బీసీలు, టీడీపీ శ్రేణులు తరలి రావాలని కోరారు.

పేదల ఆకలి తీర్చడమే టీడీపీ ధ్యేయం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 8: టీడీపీ ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5కే భోజనం సౌకర్యం కల్పించినట్లుగా తాము కూడా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 5రూపాయలకే భోజనం అందిస్తున్నామని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. రెండో రోజైన గురువారమూ ఆయన తెలుగుదేశం, జనసేన నాయకులతో కలసి పేదలకు 5 రూపాయలకే భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా అతి తక్కువ ధరకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు సురేష్‌నాయుడు, జనసేన నాయకులు తిరుపతేంద్ర, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఒడిశాలో సత్యసాయి మొబైల్ వైద్యసేవలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 8: ఒడిశాలో సత్యసాయి మొబైల్ వైద్య సేవలు అందించడానికి మొబైల్ ఆసుపత్రిని ప్రారంభించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ హాల్‌లో గురువారం మొబైల్ ఆస్పత్రి బస్సును మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. కోరాబుట్, రాయగడ్, కలహండి జిల్లాల మధ్యలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సత్యసాయి సంచార వైద్యశాల ద్వారా వైద్యసేవలు అందించనున్నారు. అక్కడ సేవా సంస్థల ఆధ్వర్యంలో వైద్య సేవలు కొనసాగుతాయి. కార్యక్రమంలో చక్రవర్తి, ఒడిస్సా సేవాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్

బీసీలపై జగన్ కపటప్రేమ

● జయహో బీసీ సదస్సులో వక్తలు


నంబులపూలకుంటలోని సదస్సులో మాట్లాడుతున్న పరిశీలకుడు వహీద్


గాండ్లపెంటలో ఐక్యతను చాటుతున్న బీసీ నాయకులు , టీడీపీ శ్రేణులు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 8: బీసీలపై జగన్ కపటప్రేమ చూపుతున్నారని, వారి కోసం ఆయన చేసిందేమీ లేదని వక్తలు దుయ్యబట్టారు. మండలకేంద్రంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారి పక్కన టీడీపీ ఆధ్వర్యంలో గురువారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పార్టీ పరిశీలకుడు వహీద్ మాట్లాడుతూ.. బీసీల కోసమే తెలుగుదేశం పుట్టిందని, ఈ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందని తెలిపారు. నాయకుడు మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. 'నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు' అని చెప్పుకునే జగన్ వారికి చేసింది మాత్రం ఏమీ లేదన్నారు. బీసీలపై జగన్ కపట ప్రేమ చూపుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, మాజీ జడ్పీటీసీ అంజనప్పనాయుడు, మాజీ సర్పంచ్ శ్రీరాముల నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, నాయకులు గుట్టా బాబు, కృష్ణమూర్తి, వెంకటనారాయణ, శ్రీనివాసులు, జనసేన మండలాధ్యక్షుడు చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

గాండ్లపెంట: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్లో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు జరిగింది. మొదట పార్టీ నాయకులు, బీసీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పరిశీలకుడు వహీద్ మాట్లాడుతూ.. టీడీపీ పాలనలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. బీసీల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసింది టీడీపీనేనన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదన్నారు. బీసీకార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలందరూ ఏకమై వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళాకమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌బాను మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ మైనార్టీలను కూడా అణగదొక్కిందన్నారు. చంద్రబాబుతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మండల కన్వీనర్ కొండయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, సర్పంచ్ శివప్పనాయుడు, నాయకులు బండారు మనోహర్‌నాయుడు, ఆనంద్, మునాఫ్, గంగరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐపై దాడి దుర్మార్గం: గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి8: కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామ సచివాలయంలో విధి నిర్వహణలో ఉన్న ఆర్ఐ దుర్గేశ్‌పై వైసీపీ సర్పంచ్ తనయుడు నారాయణస్వామి దాడి చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ ప్రభుత్వంలో ప్రజలకే కాదు అధికారులకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, ప్రజానీకం స్వేచ్ఛగా ఉండాలంటే వైసీపీని గద్దె దింపి రాష్ట్రం నుంచి పారద్రోలాలని ఆయన పేర్కొన్నారు.


పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద రెవెన్యూ డివిజనల్ ఉద్యోగుల నిరసన

నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

పుట్టపర్తిరూరల్: ఆర్ఐ దుర్గేష్, వీఆర్వో చెన్నయ్యపై దాడిచేసిన వైసీపీ సర్పంచ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలంటూ జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద రెవెన్యూ డివిజనల్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆర్ఐ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రోజురోజుకు అధికారులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. దాడిచేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామి, ఉదయ్‌కుమార్, మనోజ్‌కుమార్‌రెడ్డి, మంజుల, నరసింహులు, డీటీలు, డీఐలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ఆర్ఐ దుర్గేష్‌పై దాడి చేసిన వైసీపీ సర్పంచ్ తనయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలకేంద్రంలో రెవెన్యూ ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఆ మేరకు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాకీర్, ఆర్ఐ నాగేంద్ర, వీఆర్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఆర్ఐపై దాడి అమానుషం


కొత్తచెరువు: ఆర్ఐ దుర్గేశ్‌పై వైసీపీ సర్పంచ్ తనయుడు దాడిచేయడం అమానుషమని ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మైనుద్దీన్ మండిపడ్డారు. ఘటనను ఖండిస్తూ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆయన నిరసన తెలిపి మాట్లాడారు. దాడి చేసిన వ్యక్తిని ఇంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదని పోలీసులను ప్రశ్నించారు. ఇప్పటికైనా అరెస్టు చేయాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాలోని రెవెన్యూ అధికారులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ వడ్డె సాధికారిత సమితి జిల్లా కన్వీనర్ పల్లపు రవీంద్ర మండలకేంద్రంలోని శ్రీవిద్య కల్యాణమండపంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్ఐ దుర్గేశ్‌పై వైసీపీ సర్పంచ్ తనయుడు దాడి చేయడాన్ని వడ్డెరసంఘం ఆధ్వర్యంలో ఖండిస్తున్నామన్నారు. మద్యం సేవించి అధికారులపై దాడులు చేయడం వైసీపీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు, సాధికారిక సమితి రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ పల్లపు మహేంద్ర, మాజీ ఎంపీటీసీ వెంకటరమణప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : వడ్డె దుర్గేష్‌పై దాడి చేసిన వైసీపీ సర్పంచ్ తనయుడిపై చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు జెరిపిటి కృష్ణమూర్తి, దళవాయి వెంకటనారాయణ, సిమెంటు పోలన్న మాటాడారు. లోచర్ల గ్రామంలో విధి నిర్వహణలో ఉన్న ఆర్ఐ వడ్డె దుర్గేష్‌పై దాడి చేసిన నారాయణస్వామిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కేతనవెంకటపతి, గంగులప్ప, ఆంజినేయులు, హరి పాల్గొన్నారు.

వైసీపీ ప్రచార సభగా 'ఆసరా'

● పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి చేతులమీదుగా చెక్కు పంపిణీ


డ్వాక్రా మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్, వైసీపీ ఇన్‌చార్జి

కదిరి, ఫిబ్రవరి 8: పట్టణంలోని వీవీఆర్ గ్రాండ్‌లో గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నాలుగో విడత ఆసరా కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం వైసీపీ ప్రచార సభగా మారినట్లు ప్రజలు చర్చించుకున్నారు. ఇందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సిద్ధారెడ్డి రావాల్సి ఉండగా.. ఆయన బడ్జెట్ సమావేశాల్లో ఉన్నందు వల్ల రాలేకపోయారు. వాస్తవానికి ముఖ్య అతిథి అందుబాటులో లేనప్పుడు గతంలో సమావేశాలను వాయిదా వేసేవారు. ఆయన అందుబాటులో ఉన్న సమయంలోనే సభలు నిర్వహించేవారు. కాగా ప్రస్తుతం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బుల్‌బాషా చేత ఆసరా చెక్కును డ్వాక్రామహిలకు అందించారు. ఇలా చేయడం నియోజకవర్గ ప్రథమ పౌరుడైన ఎమ్మెల్యేని అవమానించడమేనని పలువురు పేర్కొంటున్నారు. ఆసరా సమావేశం ఆద్యంతం వైసీపీ ప్రచార సభలా కొనసాగింది. మున్సిపాలిటీకి ఏమాత్రం సబంధంలేని వైసీపీ ఇన్‌చార్జికి డ్వాక్రామహిళలతో స్వాగతం పలికించడం చూస్తూంటే .. మున్సిపల్ అధికారులు వైసీపీకి ఊడిగం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఎలాంటి అధికార హోదా లేని వైసీపీ ఇన్‌చార్జి అన్నీ తానై సమావేశాన్ని నడిపించడంపై పలువురు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసరా సమావేశానికి రాకుంటే రుణాలు, ఉద్యోగాలు పోతాయని, డ్వాక్రా మహిళలను వలంటీర్లను బెదిరించినట్లు సమాచారం. అదీగాక సమావేశంలో వైసీపీ నాయకులు కుర్చీల్లో దర్జాగా కూర్చుంటే, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కౌన్సిలర్లు మాత్రం నిలబడుకోవడం కనిపించింది.

స్కూల్ వ్యాన్ బోల్తా: ఇద్దరు విద్యార్థులకు గాయాలు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని పెడపల్లిలో గల ఉదయ్‌కిరణ్ ఇంగ్లిష మీడియం స్కూల్ వ్యాన్ బోల్తాపడి ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. గురువారం సాయంత్రం పాఠశాల వదలగానే విద్యార్థులంతా టాటా ఏస్ వ్యాన్‌లో ఇళ్లకు బయలుదేరారు. పెడపల్లి సమీపంలో పెట్రోల్ బంకు దాటగానే వ్యాన్ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఇందులో దాదాపు 20 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న రూరల్‌పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీవి దిగజారుడు రాజకీయాలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 8: వైసీపీ వారు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజులనాయుడు అన్నారు. అమడగూరు మండలం మహమ్మదాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ వారు సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలతో ఉన్నవిలేన్నట్లుగా చూపుతూ అసత్యప్రచారాలు, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నట్లు మండిపడ్డారు. చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసినట్లుగా పోస్ట్ చేయడం వారి అసత్య ప్రచారానికి పరాకాష్ట అన్నారు. ఇలా అసత్యప్రచారాలు చేసేవారు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

హామీలను వెంటనే అమలుచేయాలి

ధర్మవరం, ఫిబ్రవరి 8: గతనెలలో జరిగిన 16 రోజుల సమ్మెకాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పారిశుధ్యకార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, మకుంద డిమాండ్‌చేశారు.ఈమేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ సీఐటీయూ ఆధ్వర్యంలో వారు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్,మున్సిపల్ కార్మికసంఘం నాయకులు చెన్నకేశవులు, ఓబుళప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాధితులకు గోనుగుంట్ల పరామర్శ

ముదిగుబ్బ, ఫిబ్రవరి8: ముదిగుబ్బ మండలం పీసీరేవు గ్రామానికి చెందిన మధుసూదన్, మండలకేంద్రానికి చెందిన లోకేష్ ఆచారి ఇటీవల వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ గురువారం ఆస్పత్రులకు వెళ్లి వారిని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించారు.

నేడు శిక్షణ తరగతులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 8: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు చేపట్టనున్నట్లు డీఆర్ఓ కొండయ్య బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల అధికారులు, సహాయ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు హాజరు కావాలన్నారు.

వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరిక


టీడీపీలో చేరిన వారితో పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి8: మండలంలోని పీసీరేవు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ శ్రేణులు గురువారం టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని పరిటాల శ్రీరామ్ నివాసంలో గురువారం వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పరిటాల శ్రీరామ్ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. చేరిన వారిలో రాముడు, యోగి, రవి, సూరి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ నాయకులు తలారి చంద్రమోహన్‌బాబు, డిష్‌లచ్చి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి: కలెక్టర్


వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 8: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సేవలు, రీసర్వే, అసైన్డ్ భూములు, ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ నీటి ఎద్దడిపై అధికారులతో సమీక్ష జరిపారు. వేసవిలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి కొరతలేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. చుక్కల భూములు, ఇనాం భూములను మార్గదర్శకాల మేరకు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద రైతు సంఘం నాయకుల ధర్నా

పుట్టపర్తి, ఫిబ్రవరి 8: రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను వెంటనే మాఫీ చేయాలంటూ ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతిరైతుకు రూ.2.45లక్షలు బ్యాంకుల్లో అప్పు ఉందని, ఇందులో కనీసం రూ.2లక్షలైనా మాఫీ చేయాలని అన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సు, నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. సాగు సాయం కింద ఎకరాకు రూ.15వేలు వంతున ఇవ్వాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి సహాయ చర్యలు చేట్టాలని కోరారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు జేవీ రమణ, కమటం కాటమయ్య, చలపతి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటేశు, శ్రీరాములు, నాగభూషణ పాల్గొన్నారు.

దగా డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలి: ఏఐవైఎఫ్


గాంధీ విగ్రహం ఎదుట ఏఐవైఎఫ్ నాయకుల నిరసన

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి8: దగా డీఎస్సీ వద్దని మెగా డీఎస్సీ కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకల రాజా డిమాండ్ చేశారు. తక్కువ పోస్టులతో విడుదల చేసిన డీఎస్సీపై గురువారం ఆయన పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25వేల డీఎస్సీ పోస్టులను విడుదల చేస్తామని చెప్పిన సీఎం కేవలం 6100పోస్టులు మాత్రమే విడుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఆశల్ని అడియాసలు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు ప్రవీణ్‌రాజు, హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


రవికాంత్‌ఆచారి (ఫైల్)


నవీన్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 8: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రవికాంత్ ఆచారి, పుల్లయ్య,హేమంత్‌కుమార్ నాలుగురోజులక్రితం తిరుమలకు కారులో వెళ్లారు. గురువారం తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా.. మార్గం మధ్యలో గల మండలంలోని కాళసముద్రం వద్ద ముందు వెళ్తున్న మినీ బస్సును వీరి కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో కారును డ్రైవింగ్ చేస్తున్న రవికాంత్‌ఆచారి (38) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడుననట్లు తెలిపారు.

అలాగే తనకల్లు మండలం కొండవెనుకపల్లికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి (37) మదనపల్లి రోడ్డులోని కొలేపల్లి రోడ్డు వద్ద టీ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా అతను తనకల్లునుంచి బైక్‌లో దుకాణం వద్దకు వస్తుండగా దుకాణం సమీపంలోనే వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఆసమయంలో మదనపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతనిపై ఎక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం అనంతపురం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాలకృష్ణను కలిసిన టీడీపీ శ్రేణులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 8: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను టీడీపీ మండల, జిల్లా నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూపురంలోని జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన టీడీపీ సర్వసభ్య సమావేశంలో జిల్లా నాయకుడు జాకీర్‌అహ్మద్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, ఐటీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పొగాకు షాన్వాజ్ బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషిచేయాలని ఆయన చెప్పినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో నాయకులు గొర్ల శంకరయ్య, సాదిక్, బూత్ కన్వీనర్లు సురేష్, ఈశ్వర్ ఉన్నారు.

చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

● పల్లె నేతృత్వంలో ఆరు మండలాల్లో తీర్మానం

నల్లమాడ/కొత్తచెరువు/పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 8: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు గురువారం ప్రత్యేక సమావేశాలను నిర్వహించుకున్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సూచనల మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పార్టీ కన్వీనర్లు, అనుబంధ సంఘాలు, బూత్ కమిటీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాలకు హాజరయ్యారు. నల్లమాడ, పుట్టపర్తి ఎమ్మెల్యేగా, మంత్రిగా, ప్రభుత్వ విప్‌గా పల్లె రఘునాథరెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో మేలు చేశారని నాయకులు అన్నారు. పల్లె నాయకత్వంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని తీర్మానాలు చేశారు.


పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

నేడు పురంధరదాస ఆరాధనోత్సవం

పెనుకొండ, ఫిబ్రవరి 8: వాగ్గేయకారుడు భక్త పురంధరదాస ఆరాధనోత్సవాన్ని శుక్రవారం స్థానిక మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాలూరి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం మఠంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అనంతరం నగర సంకీర్తన ఉంటాయన్నారు. సాయంత్రం పురంధరదాస కీర్తనలను సంగీత కళాకారులు ఆలపిస్తారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు జయహో బీసీ సదస్సు

పెనుకొండ, ఫిబ్రవరి 8: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయహో బీసీ సదస్సు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెనుకొండ టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అధ్యక్షతన జయహోబీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ సిద్దయ్య, రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిధి, నగర పంచాయతీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలన్నారు.

దేవాలయాల పాలకమండలి ఎంపికకు నోటిఫికేషన్

మడకశిర రూరల్, ఫిబ్రవరి 8: మండలంలో ప్రసిద్ధిచెందిన భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి గ్రూప్ దేవాలయాల పాలక మండలి ఎంపిక కోసం నోటిపికేషన్ గురువారం విడదల చేసినట్లు ఈఓ నరసంహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాలక మండలి పదవీకాలం పూర్తి అయిందని తెలిపారు. దీంతో ఈ నోటిఫికేషన్‌ను విడదల చేసినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు 20 రోజుల్లోగా తమ దరఖాస్తులను కర్నూల్ దేవాదాయ శాఖ కార్యాలయానికి పంపించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ తెలపారు.

12న రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

గోరంట్ల, ఫిబ్రవరి 8: ఈడిగ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో గోరంట్లలో నిర్మించిన నూతన ఆలయంలో ఈ నెల 12వ తేదీన రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకుడు గిరిధర్‌గౌడ్ గురువారం తెలిపారు. శనివారం అంకురారోపణతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు విగ్రహ ప్రతిష్ఠతోపాటు ఈడిగా కమ్యూనిటీ భవనాన్ని 12న సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం నుంచి జరిగే వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నాలని కోరారు.

గర్భిణులకు భోజన వసతి

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఫిబ్రవరి 8 : సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చికిత్స కోసం వచ్చిన గర్భిణులకు ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనవసతి కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సిబ్బంది మాట్లాడుతూ... టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గర్భిణులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లుగా ఈ సేవలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ప్రైవేటు పాఠశాల కార్యాలయం సీజ్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 8: ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని ముందస్తు అడ్మిషన్‌లు చేపట్టారని, పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల కార్యాలయాన్ని డీఈఓ మీనాక్షి గురువారం సీజ్ చేశారు. ఆ పాఠశాల కార్యాలయం ఏర్పాటుపై ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏపీఎస్ఎఫ్ నాయకులు హిందూపురానికి వచ్చిన డీఈఓకు వినతి అందించారు. అందుకు స్పందించిన డీఈఓ విచారణ చేపట్టారు. నూతనంగా నిర్మిస్తున్న ఆ పాఠశాలకు సంబంధించి ఇంత వరకు ఎటువంటి అనుమతులు లేవని తేలిందని ఆమె తెలిపారు. అసలు పాఠశాల భవనమే ప్రారంభం కాకుండా అనుమతులు లేకుండా ముందస్తు అడ్మిషన్‌లు ఎలా ప్రారంభిస్తారని డీఈఓ ప్రశ్నించారు. అనుమతులు లేకుండా ఎవరైనా ముందస్తు అడ్మిషన్‌లు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, ఎంఈఓ - 2 ప్రసన్న లక్ష్మి, విద్యార్థి సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబావలి, ఉన్నారు.

'బాల్య వివాహాలను నిర్మూలించాలి'

గుడిబండ, ఫిబ్రవరి 8: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృష చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని కరెకెర గ్రామ సమీపంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా సీడీపీఓ మాట్లాడుతూ... విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థినులు 10వ తరగతి కాగానే కొంతమంది తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయడం మంచిది కాదన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు తదితర వాటిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ టీమ్‌లీడర్ ఆదినారాయణ, కేజీబీవీ ఎస్ఓ లక్ష్మి, మహిళా పోలీస్ పుష్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

రొద్దం: మండలంలోని నల్లూరు అంగనవాడీ కేంద్రాన్ని పెనుకొండ ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగనవాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

మడకశిరటౌన్, ఫిబ్రవరి 8: రొళ్ల మండలం హొట్టిబెట్ట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జి భరత్ తమ్ముడు నరేష్ గురువారం అనారోగ్యంతో మృతి చెందా డు. విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి గ్రామానికి వెళ్లి నరేష్ భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 8: మండలంలోని శీనప్పపల్లికి చెందిన సుభాషిణీ అనే మహిళ గురువారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శీనప్పపల్లికి చెందిన ప్రసాద్‌తో ఆరునెలల కిందట సుభాషినికి వివాహమైంది. అయితే నిత్యం భార్యాభర్తలు గొడవ పడేవారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన సుభాషిణీ గురువారం ఇంట్లోని విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అస్వస్థకు గురైన ఆమెను బంధువులు గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

పురంలో మార్పు ప్రారంభం

- సైకిల్ ఎక్కేందుకు క్యూకడుతున్న వైసీపీ శ్రేణులు
- నాలుగున్నరేళ్లలో అభివృద్ధి ఏమీ లేదంటూ విమర్శలు
- ఎన్నికలకు ముందు వైసీపీకి గడ్డు పరిస్థితి
- బాలయ్య సమక్షంలో టీడీపీలోకి వందలాది మంది చేరిక



మైనార్టీలను కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలకృష్ణ

హిందూపురం, ఫిబ్రవరి 8 : ఐదేళ్ల కాలంలో అధికార పార్టీ దౌర్జన్యాలు, ఆగడాలు చూసిన ప్రజలు విసిగి వేసారి పోయారు. పెద్ద నాయకులు పైపైకి గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో ఉన్న ద్వితీయశ్రేణి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వాటిని పసిగడుతున్నారు. అసంతృప్తితో రగిలిపోతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏం అభివృద్ధి చేశామంటూ మండిపడుతున్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి ఏమీ చేయకపోవడంతో ప్రజలకు మొహం చూపించలేక పోతున్నామని వాపోతున్నారు. దీంతో ప్రతి నియోజకవర్గంలోనూ వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు మొదలయ్యాయి. చాలామంది ద్వితీయశ్రేణి నాయకులు సైకిల్ ఎక్కడానికి సిద్ధమయ్యారు. ప్రముఖ సినీనటుడు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సొంత నియోజకవర్గమైన హిందూపురంలో టీడీపీలోకి వలసలు మొదలయ్యాయని చెప్పవచ్చు. దీంతో వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీకి ఎదురుగాలి తప్పదని వైసీపీ శ్రేణులు అంటున్నాయి. మొన్నటి వరకు బాలకృష్ణను ఓడిస్తాం. కంచుకోటను బద్దల కొడతాం. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తారు. వేలాది మంది టీడీపీవారు చేరుతారని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. వేలమాట ఏమోకాని పట్టుమని పది మంది చేరలేదు. కానీ ఎమ్మెల్యే బాలకృష్ణ నెల పర్యటనలో వైసీపీకి చెందిన తూముకుంట ఎంపీటీసీ కుమారుడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా గురువారం వైసీపీ కౌన్సిలర్ పరశురాంతోపాటు ఎంఐఎం పార్టీ తరుపున కౌన్సిలర్‌గా పోటీ చేసి 70ఓట్ల తేడాతో ఓడిపోయిన అభ్యర్థితోపాటు 300మందికి పైగా మైనార్టీలు బాలయ్య సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ నాయకుల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిని చూసిన రాజకీయ విశ్లేషకులు మార్పు మొదలైందని అది హిందూపురం తోనే ప్రారంభం కావడం శుభసూచకమంటున్నారు.

పురంలో మారుతున్న రాజకీయం

ఎన్నికలు సమీపిస్తుంటే అధికార పార్టీలో నిస్తేజం కొనసాగుతోంది. ప్రజలవద్దకు ధైర్యంగా వెళ్లడానికి స్థానిక ప్రజాప్రతినిధులు జంకుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనీసం రూ.10వేలు అభివృద్ధి పని కూడా ఎక్కడా చేయలేదని జంకుతున్నారు. దీంతో ఈ పార్టీలో ఎన్ని రోజులున్నా ఇంతే అనుకుంటున్నారు. దీనికితోడు రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, వైసీపీ అరాచకాలు, సర్వేల ఫలితాలు బేరీజు వేసుకున్న ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి రావడానికి సిదమవుతున్నారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నా, వారికి మాయమాటలు చెబుతున్నా వినకుండా టీడీపీలోకి రావడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఇటీవలే హిందూపురంలో మంత్రి పెద్దిరెడ్డి వారం రోజుల పాటు ఉండి వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అభయం ఇచ్చారు. అయినా నాయకుల్లో అభద్రతా భావం పోలేదు. ఇక్కడ ఎన్నేళ్లు పనిచేసినా ఇంతేనంటూ వైసీపీ నాయకులు పార్టీ మారడానికి సిద్ధమవుతున్నారు.

సైకిల్ ఎక్కేందుకు సిద్ధమవుతున్న వైసీపీ శ్రేణులు

సార్వత్రిక ఎన్నికల వేళ అధికార పార్టీకి గడ్డు పరిస్థితి ఎదురవుతోందని, ప్రతి నియోజకవర్గంలోనూ టీడీపీలో భారీగా చేరికలు జరుగుతాయని ఆ పార్టీ నాయకులు ముందుగానే ఊహించారు. పార్టీలో చేర్చుకునేందుకు ఎమ్మెల్యే బాలకృష్ణ సంసిద్ధత వ్యక్తం చేయగా వలసలు ప్రారంభం అయ్యాయి. గత నెలలో గ్రామీణ ప్రాంతం, పట్టణం నుంచి వంద మంది చేరగా గురువారం వైసీపీ కౌన్సిలర్‌తోపాటు ఎంఐఎం పార్టీ, జనసేన నాయకులు మొత్తం 300 కుటుంబాలకుపైగా చేరినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

మరికొంతమంది సిద్ధం

హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి టీడీపీలో చేరడానికి మరికొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, తృతీయశ్రేణి నాయకులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. పట్టణంలో మరో పది మంది కౌన్సిలర్లు , హిందూపురం మండలంలో ఓ మండల ప్రజాప్రతినిధితోపాటు ముగ్గురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచులు సైకిల్ ఎక్కడానికి సై అంటున్నారు. లేపాక్షి మండలంలో ఇద్దరు ఎంపీటీసీలతో పాటు ముగ్గురు సర్పంచులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. చిలమత్తూరు మండలంలో అధికార పార్టీకిచెందిన ఓ ముఖ్య నాయకుడితోపాటు ఐదారుగురు స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ మారేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే నియోజకవర్గ స్థాయిలో పేరున్న నాయకులు ఐదారుగురు టీడీపీలో రావడానికి లైన్ క్లియర్ చేసుకుంటున్నట్లు సమాచారం.

కొన్ని చోట్ల టీడీపీ నాయకులే అడ్డంకి

తెలుగుదేశం పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేర్కొంటున్నారు. ఇదే మాటను స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సైతం చెబుతున్నారు. అయితే నియోజకవర్గంలో అధికార పార్టీలో బలమైన నేతలు తెలుగుదేశంలో వస్తామని చెబుతున్నా స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. చిలమత్తూరు మండలంలో 2019 ఎన్నికల ఫలితాలను బట్టి అక్కడ తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాల్సి ఉంది. అక్కడ పార్టీలోకి ఎవరు వచ్చినా చేర్చుకోవాలని అత్యధికమంది టీడీపీ శ్రేణులు కోరుతుండగా ఇద్దరు ముగ్గు రు నాయకులు అడ్డుపడుతున్నట్లు సమాచారం. ఇదే విష యాన్ని కొంతమంది అధికార పార్టీ నాయకులు బహిరం గంగా చెబుతున్నారు. వైసీపీ నుంచి బలమైన నాయకులు వస్తే మా పరిస్థితి ఏంటని ముందుగానే వారిని అడ్డుకు నేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఎమ్మెల్యే ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. ఒకరిద్దరు నాయకుల వల్ల వందలాది ఓట్లు సంపాదించే నాయకులను అడ్డుకోవడం సరికాదని టీడీపీ నాయకులే అంటున్నారు. ఏది ఏమైనా హిందూపురం నియోజకవర్గంలో మార్పు మొదలైంది. ఇది ఎక్కడి వరకు వస్తుందో మరో రెండు నెలలు వేచి చూడాలి.

ఎనిమిది వార్డుల నాయకులతో సమీక్ష

హిందూపురం, ఫిబ్రవరి 8 : పట్టణ పరిధిలోని జీవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 15, 16, 19, 20, 35, 36, 37, 38వార్డుల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. పార్టీ అధికారంలోకి రాగానే ముద్దిరెడ్డి, సింగిరెడ్డిపల్లి, రహమత్‌పురం, విద్యానగర్, సూగూరు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ముద్దిరెడ్డిపల్లి నాయకులు బండారు బాలాజీ, కోరుముట్ల నాగేంద్ర, మహాలక్ష్మి, ఏసీ నాగరాజు, మంచాల మారుతి, పామిశెట్టిశేఖర్, హరి, నారాయణరెడ్డి, బాబు, శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణానికి చెందిన నాయకులు డైమండ్‌బాబా, యుగందర్ భార్గవ్, సర్పంచ్ మంజునాథ్, రవిచంద్ర, సతీష్, రాఘవేంద్ర, పరిమళ, ఎగువింటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు

హిందూపురం: స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పర్యటన సందర్భంగా హిందూపురం పట్టణంతో పాటు చిలమత్తూరు మండలానికి చెందిన వైసీపీ శ్రేణులు వందలాది మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిలమత్తూరు సోమఘట్టకు చెందిన 40 కుటుంబాలు వారు టీడీపీ నాయకుడు తిప్పారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. హిందూపురం మున్సిపల్ పరిధిలోని రహమత్ పురానికి చెందిన ఎంఐఎం పార్టీ నాయకుడు అక్బర్‌తో పాటు 25 కుటుంబాల వారు పార్టీలోకి చేరారు. నింకంపల్లికి చెందిన 200 మందికి పైగా వైసీపీ కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్ హిదయతుల్లా, క్లస్టర్ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో బాలయ్య సమక్షంలో చేరారు. మాజీ మునిసిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో రహమత్‌పురం, ముక్కిడిపేటకు చెందిన ఆదిల్, జియ, వినయ్ తదితరులు చేరారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, నాయకులు నాగరాజు పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్, అనిల్‌కుమార్, నబీరసూల్, నెట్టెప్ప, రవీంద్ర నాయుడు, అశ్వత్థనారాయణరెడ్డి, ప్రెస్‌వెంకటేష్, మోదా శివ, లీగలసెల్ కొల్లకుంట శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 8: ఆర్టీసీలో సమస్యల పరిష్కారానికి శుక్రవారం డయల్‌యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం శ్రీకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ హిందూపురం పరిధిలోని బస్సులు, రవాణా సౌకర్యం, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఫోన్ ద్వారా ఫిర్యాదులు తెలుపవచ్చన్నారు. వివరాలకు ఫోన్ నెం. 9959225858ను సంప్రదించాలన్నారు.

ఎంజీఎం పాఠశాలలో సదుపాయాలపై డీఈఓ ఆరా

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 8: పట్టణ పరిధిలోని ఎంజీఎం పాఠశాలలో డీఈఓ మీనాక్షి గురువారం తనిఖీలు చేపట్టారు. మార్చి18 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉన్నా యా లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు బెంచులు, గాలి, వెలుతురు, ఫ్యా న్లు, లైట్లు, తాగునీటి సౌకర్యంపై హెచ్ఎం సామ్రాజ్యాన్ని అడిగి తెలుసుకున్నా రు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకూడదని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న పరిణామాలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఐకమత్యంతో ఉండి పాఠశాలలో ఎటువంటి గొడవలు లేకుండా పాఠశాల విషయాలు బయటికి పొక్కకుండా చూసుకోవాలని సూచించారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీదే విజయం

బీజేపీ చిత్రదుర్గం నాయకుడు రఘుచందన్

పావగడ, ఫిబ్రవరి 8: ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరగబోయే దేశ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాల్లో గెలుపొంది నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం అని చిత్రదుర్గం పార్లమెంటు నియోజకవర్గం ఎంపీ టికెట్ ఆశా వాహులైన రఘుచందన్ తెలియజేశారు. పావగడ టీడబ్ల్యూడీ ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరేంద్రమోదీ దేశం అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు ప్రవేశపెట్టారని, అనేక విదేశాల్లో వాణిజ్య ఒప్పందాలు ఏర్పాటు చేసుకొని దేశ అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడానికి అన్ని విధాలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈసందర్భంగా జేడీఎస్, బీజేపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

17 నుంచి భారత రాజ్యాంగ చైతన్య యాత్ర

పావగడ, ఫిబ్రవరి 8: భారత రాజ్యాంగ చైతన్య రథ యాత్ర ఈనెల 17న అన్ని గ్రామ పంచాయతీలకు తరలివస్తున్న సందర్భంగా పంచాయతీ పీడీఓలు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున తెలియజేశారు. ఇప్పటికే అన్ని పంచాయతీలకు చైతన్యరథ యాత్రకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారని, 17వతేదీ నుంచి 23 వరకు రథయాత్ర కొనసాగుతుందన్నారు.

రేషన్ సరుకుల్లో కోత

బియ్యం మాత్రమే పంపిణీ

మడకశిర రూరల్, ఫిబ్రవరి 8 : పేద ప్రజలకు ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో కార్డులకు అందించే నిత్యావసర సరుకుల్లో ఈ నెలలో ప్రభుత్వం కోత విధించింది. బియ్యం మాత్రమే పేదలకు పంపిణీ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో సరుకులు పంపిణీ చేయకపోవడంతో పేదలకు కుటుంబ పోషణ మరింత కష్టంగా మారింది. మండలంలో 62 చౌకదుకాణాలుండగా, 25,600 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెల బియ్యం , రాగులు చక్కెర, కందిపప్పు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈ నెలలో ఎఫ్‌పీ షాపుల్లో కందిపప్పు, చక్కెర, రాగులు పంపిణీ చేయడంలేదు. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రమే చక్కెర పంపిణీ చేస్తున్నారు. కార్డుల లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నిత్యావసర సరుకులు పంపిణీచేయాలని పేదలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారలను వివరణ కోరగా వారెవరూ స్పందించలేదు.

అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ



వైసీపీ పాలనలో ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రతి నెల కార్డుల లబ్ధిదారుల కు సరుకుల పంపిణీలో కోత విధిస్తూనే ఉన్నారు. ఏ నెలలోనూ అన్ని సరుకులు సక్రమంగా పంపిణీచేయలేదు. ఫిబ్రవరి నెలలో కొన్ని గ్రామాల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు ఇవ్వడం లేదు. టీడీపీ పాలనలో కార్డుల లబ్ధిదారులకు ప్రతి నెల సరుకులు సక్రమగా ఇవ్వడమే కాకుండా ప్రతి పండుగకు చంద్రన్న కానుక కింద ప్రత్యేక సరుకుల ఇచ్చేవారు. వైసీపీ పాలనలో ఎఫ్‌పీ షాపులో ప్రతి నెల కార్డుల లబ్ధిదారులకు సరుకుల్లో ఒకటి ఇస్తే మరొకటి ఇవ్వడంలేదు.

- లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్, మడకశిర

వైసీపీ పాలనలో ఉద్యోగులకూ రక్షణ కరువు : బీకే

పెనుకొండ, పిబ్రవరి 8 : వైసీపీ పాలనలో ప్రజలకే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రక్షణ కరువైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ... కొత్తచెరువు మండలం లోచర్ల సచివాలయంలో విధినిర్వహణలో ఉన్న ఉద్యోగిపై వైసీపీ నాయకుడి దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. సచివాలయ ఉద్యోగి దుర్గేష్‌పై వైసీపీ నాయకుడు నారాయణస్వామి దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రజలకే కాకుండా అధికారులకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. మొన్న విశాఖ పట్నంలో తహసీల్దార్‌ను చంపడం, నిన్న యర్రచందనం స్మగ్లర్లు పోలీసులను పొట్టన పెట్టుకున్న సంఘటన మరువకుండానే లోచర్ల ఆర్ఐపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి - నియోజకవర్గ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 8: నియోజకవర్గంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. మడకశిరలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం అవరణంలో గురువారం ఉద్యోగ సంఘం నూతన నియోజకవర్గ కమిటీ ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలు, ఐఆర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం ఉద్యోగ సంఘం నియోజక వర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఎలెక్షన్ అధికారిగా కే నారాయణరెడ్డి, అసిస్టెంట్ ఎలెక్షన్ అధికారిగా ఎ.గోవిందప్ప, పరిశీలకులుగా అబ్దుల్‌ఖాదర్ తదితరుల పర్యవేక్షణలో నూతన కమిటీని ఎన్నుకొన్నట్లు తెలిపారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

మేధోశక్తిని వెలికి తీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శంకర్‌రావు



నమూనాలను తిలకిస్తున్న న్యాయాధికారి శంకర్‌రావు

పెనుకొండ, ఫిబ్రవరి 8 : విద్యార్థుల్లో దాగి ఉన్న మేధోశక్తిని వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదపడ తాయని సీనియర్ సివిల్ కోర్టు న్యాయా ధికారి శంకర్‌రావు పేర్కొన్నారు. స్థానిక బ్రిలియన్స్ పాఠశాలలో గురువారం కరస్పాండెంట్ నాగవేణి ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శంకర్‌రావు, ఎస్ఐ సురేష్, ఓం శాంతి హేమలత, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వర్‌రావు, కర్ణాటక బ్యాంక్ మేనేజర్ దీపిక హజరయ్యారు. విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన 350నమూనాలను తిలకించి అభినందించారు. భవిష్యత్తులో ఒక్కో విద్యార్థి ఒక్కో శాస్త్రవేత్తగా వెలగాలన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు.

అన్నివర్గాలను నిరాశ పరిచిన బడ్జెట్ : గుండుమల



విలేకరులతో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీ తప్ప, ఏ మాత్రం ఉపయోగం లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి విమ్మంచారు. ఈ బడ్జెట్ అన్నివర్గాలను నిరాశ పరిచిందన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ బడ్జెట్‌లో పన్నుల బాదుడే తప్ప కొత్త అంశాలు ఏమీ లేవని, అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పు లు రెట్టింపు అయ్యాయన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ప్రతి స్కీం స్కామ్‌గా మారిందని, రాష్ట్రంలో వచ్చే ఆదాయం అంతటితో వారి జేబులు నింపుకొంటు న్నారే తప్ప... సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. బీసీలను రాజ్యాధికారం నుంచి దూరం చేసిన పార్టీ వైసీపీ అని... ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఆర్థికంగా అణగదొక్కారన్నారు. వైసీపీ పాలనలో రూ. 13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ. 44 వేల కోట్లకు, రూ. 35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత ఆర్థిక మంత్రి బుగ్గనదే అన్నారు. మద్యం బాం డ్లు రూ. 16 వేల కోట్లు, కార్పొరేషన్ హామీలు రూ. 1.10 లక్షల కోట్లు, కార్పొ రేషన్ తనఖాలు రూ.94 వేల కోట్లు, బెస్కాం రూ. 27 వేల కోట్లు, కాంట్రాక్టర్లకు బిల్లులు రూ.95వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈప్రభుత్వంలో సామా న్యులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని, అనర్హులకే పెద్దపీట వేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఇంటికి పోవడానికి సిద్ధంగా ఉండాలని హితవు పలికారు. ఈకార్యక్రమంలో పా ర్టీ పరిశీలకులు పార్థసారథిరెడ్డి, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందప్ప, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్షర్, నాయకులు నాగరాజు, మనోహర్, లక్ష్మీనారా యణ, తిప్పేస్వామి, నాగరాజు, మల్లికార్జున, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ : సవిత



పేటీఎం బ్యాచ్‌పై మండిపడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 8 : లేనిది ఉన్నట్లు కల్పితం చేయడం, వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడం, ఫేక్ క్రియేటివిటీతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నించడం అధికార పార్టీ వైసీపీకే చెల్లుబాటు అవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ధ్వజమెత్తారు. ఆమె గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... వైసీపీ పేటీఎం బ్యాచ్‌పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫేక్ ప్రచారాలను తిప్పి కొట్టేబాధ్యత ప్రజలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీలో కేంద్ర హోమ్ శాఖమంత్రి అమిత్ షాను కలిశారు. దీనిని ఫేక్ ప్రచారాలకు పరాకాష్టగా తీసుకొన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి పేటీఎం బ్యాచ్ ఎంత నీచానికైనా దిగజారుతుందని దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు న్నారు. చంద్రబాబు ఢిల్లీలో అడుగు పెట్టకముందే విషప్రచారం మొదలు పెట్టారన్నారు. అమిత్‌షాతో భేటీ మొదలు కాకుండానే పొత్తులు, సీట్ల ఖరారుపై ప్రచారం చేశారని అన్నారు. మార్ఫింగ్ ఫొటోలతో తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. ఈ ఫేక్ ప్రచారాలు చేసేవారికి భవిష్యత్తులో బుద్ధి చెబుతామని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాబోయేది తెలుగుదేశం పార్టీయేనన్నారు. ఫేక్‌రాయుళ్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించండి

అగ్రంపల్లి వాసుల విన్నపం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 8 : మండలంలోని కల్లుమర్రి పంచాయతీ అగ్రంపల్లిలో డ్రైనేజీలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 75 కుటుంబాలు ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు అంత ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్నాయి. దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఆనారోగ్యం పాలవుతున్నారు. మురుగు నీరు వల్ల గ్రామంలోని ప్రజలకు రాకపోకలు కష్టంగా మారింది. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో డ్రైనేజీని నిర్మిం చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అగ్రంపల్లిలో ప్రధాన రహదారిలో మురుగునీరు